## శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా వరద..!



2లో


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


## ఢిల్లీలో స్పేస్ హీరో శుభాంశు శుక్లాకు ఘన స్వాగతం



2లో


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 231 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 18 ఆగస్టు 2025


# 'ఓట్ల చోరీ' ఆరోపణలు..



- ఖండించిన చీఫ్ ఎలెక్షన్ కమిషనర్..

**న్యూఢిల్లీ:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** ఇటీవల జరిగిన పలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మిగతా2లో...

# అభివృద్ధిని చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు

- ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో దాదాపు రూ.11వేల కోట్ల విలువైన రెండు కీలకమైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. వీటిలో ఢిల్లీ సెక్షన్‌లోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2 ఉన్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఢిల్లీ, హర్యానా ముఖ్యమంత్రులు రేఖ గుప్తా, నయాబ్ సింగ్ సైనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ముందుగా రోడ్ షో నిర్వహించారు. ఢిల్లీకి ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ కనెక్టివిటీ లభించనున్నది. కొత్త ఎక్స్‌ప్రెస్‌వే నుంచి ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందనున్నది. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ రోడ్లు ప్రయాణాన్ని సులభతరం చేయడంతో పాటు ఎన్‌సీఆర్ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ చుట్టూ బీజేపీ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ఇది మనకే ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని చూపిస్తుందని.. కొందరు దీన్ని తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. వారంతా ప్రజలకు దూరంగా ఉన్నారన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పేరు ద్వారక అని.. మిగతా2లో...

# ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్



**న్యూఢిల్లీ:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరు ఖరారైంది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన ఉప రాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ దాఖలుకు చివరి తేదీ ఈ నెల 21.1957 మే 4వ తేదీన జన్మించిన సీపీ రాధాకృష్ణన్.. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు బీజేపీ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించారు. 2016 నుంచి 2019 వరకు ఆలిండియా కాయర్ బోర్డు చైర్మన్‌గా పని చేశారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి జార?ండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డికి ఓయూ ఆహ్వానం

- ఈనెల 21న పలు కార్యక్రమాలకు హాజరు

**హైదరాబాద్:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** ఉస్మానియా యూనివర్సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్స వ, శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరు మిగతా2లో...

# పేదల ఓటు అధికారాన్ని వారికి దూరం కానివ్వం : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):**ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఆరోపణలను తీవ్రం చేశారు. ఓట్ల విషయంలో బీజేపీతో కలిసి ఈసీ అవకతవకలకు పాల్పడుతున్నట్లు యావత్ దేశానికి తెలిసిందన్నారు. బీహార్‌లోని ససారం నగరంలో 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రారంభోత్స వంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట బీహార్‌లో ఓట్ల తొలగింపు, చేర్పుల లాంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. 'ఇండియా' కూటమి దీనికి అనుమతించబోదని, పేదల ఓటు మిగతా2లో...



# లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రేపట్నుంచి శిక్షణ: పొంగులేటి

**హైదరాబాద్:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రేపటి నుంచి రెండో విడత శిక్షణ ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు. లైసెన్స్‌డ్ మిగతా2లో...


# ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు..

## రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్నదే రేవంత్ ఆకాంక్ష : కేటీఆర్



**హైదరాబాద్:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పదే పదే చెబుతున్న ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని, తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తెలంగాణ ఫార్మా సిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజాధనం వృథా అవుతోందన్నారు. ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో మిగతా2లో...

# యమునా నదికి భారీ వరద.. ఢిల్లీలో డేంజర్ బెల్స్..!



**న్యూఢిల్లీ:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** దేశవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు నగర ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, ముంబైలో చినుకు పడితే చాలు వాహనదారులు, లోతట్టు కాలనీ వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాజాగా ఢిల్లీ కూడా వరద ముప్పును ఎదుర్కొంటోంది. యము నా నది మరో రెండు రోజుల్లో ఉగ్రరూపం దాల్చ నుండడమే అందుకు కారణం. అప్రమత్త మైన ఢిల్లీ ప్రభుత్వం ప్రజలకు ఆదివారం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. హర్యానాలోని హత్ని కుండ్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయ డంతో యమునా నిండుకుండలా మారింది. ఆదివారం ఉదయం 1.76లక్షల క్యూసెక్కుల నీరు యమునాకు చేరింది. ఇదే విధంగా వరద నీరు వస్తే.. సోమ, మంగళవారం ఉదయం 2 గంటల నాటికి నదిలో 206 మీటర్ల మేర నీరు చేరనుందని వరద నియంత్రణ విభాగం తెలిపింది.

# ఎల్లంపల్లి మోటార్లు మేము ఆన్ చేయాలా? మీరు చేస్తారా?: హరీష్ రావు



**హైదరాబాద్:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద వస్తుందని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గెట్లు ఎత్తి నీటిని వృథా చేస్తున్నారని, 60 వేల క్యూసెక్కుల వరదను సముద్రంలోకి వదులుతున్నారని దుయ్యబట్టారు. ఆదివారం సిద్దిపేటలో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. మిగతా2లో...

# మూడురోజులు తెలంగాణలో అతిభారీ వర్షాలు..

- రెడ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ..!



**హైదరాబాద్:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణలో గతవారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు వరదలు పోటెత్తాయి.

మిగతా2లో...

# ఏడుపాయల ఆలయం జలదిగ్బంధం



**హైదరాబాద్:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టు నుంచి 5 గేట్లు ఎత్తి 50వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో మెదక్ జిల్లా నాగ్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీ వనదుర్గా భవాని మాత ఆలయం గత నాలుగు రోజులుగా పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆదివారం నాటికి నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగి, ఏడుపాయల గుండా పొంగిపొర్లడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. ప్రధాన ఆలయం లోపలికి వరద నీరు చేరింది. భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలు లేకపోవడంతో అధికారులు తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేశారు. ప్రస్తుతం భక్తులు ఆలయ మిగతా2లో...

# 'ఓట్ల చోరీ' ఆరోపణలు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ ఖండించారు. ఎన్నికల సంఘానికి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదన్నారు. ఓటరు జాబితాను బూత్ లెవల్‌లోనే ప్రతి పార్టీ చూసుకుంటుందని పేర్కొన్నారు. సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు ఉంటుందని.. పౌరుల మధ్య ఇసి వివక్ష చూపదు అని అన్నారు. చట్టాలను ఇసి ఎప్పుడూ గౌరవిస్తుందని తెలిపారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణలో ఓట్లు తొలగిస్తే అభ్యంతరాలు చెప్పవచ్చు అని.. సర్‌లో అన్నీ రాజకీయ పార్టీలను భాగస్వామ్యం చేస్తామన్నారు. అబద్ధపు ప్రచారాలను పట్టించుకోమని.. ప్రతిపక్షాలు ఓటర్లను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నిక ప్రక్రియలో లోపాలున్నా ప్రతిపక్షాలు అభ్యంతరాలు తెలుపవచ్చని సూచించారు.

# అభివృద్ధిని చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమం జరుగుతున్న ప్రదేశం రోహిణి అని, జన్మాష్టమి ఆనందం అని, యాదృచ్ఛికంగా ద్వారకాధీశ భూమి నుంచి వచ్చానని మోదీ పేర్కొన్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. నేడు దేశ రాజధాని ఢిల్లీ దేశంలో జరుగుతున్న అభివృద్ధి విప్లవాన్ని చూస్తోంది. కొద్దిసేపటి క్రితం ఢిల్లీ ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌తో అనుసంధానంతో ఢిల్లీ, గురుగ్రామ్, ఎన్‌సీఆర్ ప్రజల సౌకర్యాన్ని పెంచుతుందని.. ప్రతి ఒక్కరి సమయం ఆదా అవుతుందన్నారు. మన వ్యాపారులు, వ్యాపారవేత్తలు, రైతులు ప్రత్యేక ప్రయోజనాలను పొందబోతుందన్నారు. ప్రపంచం భారతదేశాన్ని చూసినప్పుడు.. మూల్యాంకనం చేసిన సమయంలో మొదటి దృష్టి మన రాజధాని ఢిల్లీపై పడుతుందన్నారు. మనం ఢిల్లీని అభివృద్ధి నమూనాగా మార్చాలని పిలుపునిచ్చారు. ఢిల్లీని గొప్ప నగరంగా మార్చడానికి మనం చేపట్టిన పని నిరంతరం కొనసాగుతోందన్నారు.నేటికీ మనమందరం దీనికి సాక్షులమని.. అది ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ అయినా ఈ రెండు రోడ్లు అద్భుతంగా నిర్మించినట్లు పేర్కొన్నారు. పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే తర్వాత.. ఇప్పుడు అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ ఢిల్లీకి చాలా సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌కు మరో ప్రత్యేకత ఉందని.. ఇది ఢిల్లీని చెత్త నుంచి విముక్తి చేయడంలో సహాయపడుతుందన్నారు. అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్‌ను తయారు చేయడంలో లక్షల టన్నుల చెత్తను ఉపయోగించారని.. వ్యర్థ పదార్థాలను రోడ్డు తయారీలో ఉపయోగించారన్నారు. రేఖ గుప్తా నాయకత్వంలోని ఢిల్లీ బీజేపీ ప్రభుత్వం యమునను శుభ్రపరిచే పనిలో నిరంతరం నిమగ్నమై ఉండడంపై సంతోషంగా ఉన్నానని ప్రధాని మోదీ అన్నారు. ఈ సమయంలో యమునా నది నుంచి 16 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారని.. ఢిల్లీలో చాలా తక్కువ సమయంలో 650 దేవి ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభమయ్యాయన్నారు. భవిష్యత్తులో ఈ ఎలక్ట్రిక్ బస్సులు సుమారు 2వేల సంఖ్యను దాటుతాయని.. గ్రీన్ ఢిల్లీ – క్లీన్ ఢిల్లీ మంత్రాన్ని మరింత బలపరుస్తుందన్నారు. దేశంలోనే మొదటి ఎనిమిది లైన్ల అర్బన్ ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే అయిన ఈ ప్రాజెక్టు ఢిల్లీ–గురుగ్రామ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. 10.1 కిలోమీటర్ల మార్గాన్ని రూ.5,360 కోట్లతో నిర్మించారు. ఈ మార్గం యశోభూమి, ఢిల్లీ మెట్రో బ్లూ, ఆరెంజ్ లైన్లకు, రాబోయే బిజ్వాసన్ రైల్వే స్టేషన్‌కు అనుసంధాస్తుంది. గతేడాది మార్చిలో ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని 19 కిలోమీటర్ల హర్యానా విభాగాన్ని ప్రధాని ప్రారంభించారు. తాజాగా ఢిల్లీ విభాగం సైతం అందుబాటులోకి వచ్చింది. దాంతో గురుగ్రామ్ నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు కేవలం 20 నిమిషాల్లో చేసే అవకాశం ఉంటుంది. ఇక రూ.5,580 కోట్ల వ్యయంతో నిర్మించిన UER-II ప్రాజెక్టు ఢిల్లీకి మూడో రింగ్ రోడ్‌గా పని చేయనున్నది. ఢిల్లీ, సోనిపట్, బహదూర్‌గఢ్ వంటి నగరాలను కలుపుతోంది. అలీపూర్ నుంచి డిచాన్ కలాన్ వరకు నిర్మించారు. నిర్మాణానికి ఘాజీపూర్ ల్యాండ్‌ఫిల్ నుండి సేకరించిన రెండు మిలియన్ టన్నుల వ్యర్థాలను ఉపయోగించడం విశేషం.

# పేదల ఓటు అధికారాన్ని వారికి దూరం కానివ్వం : రాహుల్‌గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

అధికారాన్ని వారి నుంచి దూరం కానివ్వబోదని అన్నారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు చోరీకి గురవుతున్నాయని ఆరోపించారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి సత్తా చాటిందని, అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమదే విజయమనే అంచనాలు వెలువడ్డాయని, కానీ నాలుగు నెలల్లోనే కోటి మంది ఓటర్లు వచ్చి చేరడంతో బీజేపీ కూటమి గెలిచిందని వెల్లడిం చారు. ఎక్కడైతే ఓట్లు పెరిగాయో అక్కడ కాషాయ పార్టీ గెలిచిందని రాహుల్‌గాంధీ చెప్పారు. ఈసీ ఏం చేస్తోందో ఇప్పుడు అందరికీ తెలిసిందని అన్నారు. ఓట్ల చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం తన నుంచి అఫిడవిట్ కోరిందని, బీజేపీ నేతలూ అదేవిధమైన వాదనలు చేస్తే ఆ ప్రస్తావనే తీసుకురాలేదని తెలిపారు.బీజేపీ, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నాయని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రేపట్నుంచి శిక్షణ: పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

సర్వేయర్లకు 23 జిల్లా కేంద్రాల్లో రేపట్నుంచి శిక్షణ ఇస్తామని ప్రకటించారు. ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షలు జరిపారు. అభ్యర్థులు ఆయా జిల్లాల్లో సోమవారం ఉదయం పది గంటల లోపు రిపోర్ట్ చేయాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అక్టోబర్ 2 నాటికి అందుబాటులోకి వస్తారని పొంగులేటి వివరించారు.

# మూడురోజులు తెలంగాణలో అతిభారీ వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు చేసింది. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని జిల్లాలకు రెడ్ అలెర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం కొత్తగూడెం, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ చేసింది వాతావరణశాఖ. ఆదిలాబాద్, జనగాం, భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కొనసాగుతాయని చెప్పింది. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలుంటాయని తెలిపింది. ఆదిలాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు.. కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కామారెడ్డి, మెదక్, ములుగు, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణశాఖ.

# సీఎం రేవంత్ రెడ్డికి ఓయూ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

కావాలంటూ ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫె సర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కా లేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి కాశీం ఆ దివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ రేవంత్ రెడ్డిని ఆయన ని వాసంలో కలిసి ఆగస్ట్ 21నఓయూలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా రావాలని ఆహ్వానం పలికారు.ఓయూలో రూ. 80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1200 మంది విద్యా ర్థులకు వసతి కల్పించే రెండు హాస్ట ల్స్ ను ప్రారంభించి, గిరిజన సంక్షే మం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి క ల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మా ణానికి శంకుస్థాపన కార్యక్రమం సీ ఎం చేతులమీదుగా జరుగనున్నది. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్ట ళ్లలో 7223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదు గా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు 10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్‌రూం పనులకు కూడా సీఎం ప్రారం భించనున్నారు. అదే రోజు ఓయూ లో ఉన్న టాగూర్ ఆడిటోరియంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను, విద్యా ర్థులను ఉద్దేశించి " తెలంగాణ వి ద్యా రంగంలో రావాల్సిన మార్పు లు ప్రభుత్వ ప్రణాళిక" అనే విష యం మీద సీఎం ప్రసంగించను న్నారు. ఈ కార్యక్రమంలో తెలంగా ణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అ డ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొంటారు. ఇరవై ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి ప్ర సంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డి అని వారు తెలిపారు. "సీఎం రీసెర్చ్ ఫెలో షిప్ " తో పాటు విదేశీ పర్య టనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక స హాయాన్ని అందించే పథకాన్ని సీ ఎం చేతుల మీదుగా ప్రారంభించను న్నామని వీసీ తెలిపారు.

# ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు.ఇది నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ తాను రెండేళ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంటోందని, చివరికి అధికారులు కూడా దీన్ని అంగీకరిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 20వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారు చేసిందని.. స్థానిక రైతులు రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వచ్చి తమ భూములను హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. కొంతమంది తమ భూములు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మా సిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజా ధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించినా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కనపెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దాంతో ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు.

# శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీగా వరద..!



**హైదరాబాద్:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** కృష్ణా ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. నదీ పరీవాహక ప్రాంతాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో వరద పోటెత్తుతున్నది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తుండడంతో అధికారులు మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి ప్రస్తుతం 79,269 క్యూసెక్కుల వరద సాగర్ వైపు వెళు తున్నది. జూరాల, సుంకేశుల నుంచి ప్రాజెక్టుకు 1,18,410 క్యూసెక్కుల వరద వస్తుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.4 అడుగుల మేర నీరు ఉంది. పూరిస్థాయినీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 195.6 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.శ్రీశైలం, కుడి, ఎడమ గట్టుల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. రెండు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 65,807 క్యూసెక్కుల వరద కిందకు వెళ్తోంది. ఇదిలా ఉండగా.. నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్‌కు సైతం వరద వచ్చి చేరుతున్నది. దాంతో అధికారులు 22 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌కు ఇన్‌ఫ్లో 1,71,683 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 2,12,753 క్యూసెక్కులుగా ఉన్నది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. సాగర్ ప్రస్తుత నీటిమట్టం 587 అడుగులు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# ఎల్లంపల్లి మోటార్లు మేము ఆన్ చేయాలా? మీరు చేస్తారా?: హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)


కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను ఆన్ చేసి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మీద కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. బురద రాజకీయం చేస్తూ వరదను వృథాగా పోనీయొద్దని, గోదావరి పరివాహకంలో చాలా జలాశయాలు ఖాళీగా ఉన్నాయని, ఎల్లంపల్లి నుంచి వెంటనే రోజుకు రెండు టిఎంసిల నీళ్లు ఎత్తిపోయాలని, ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఏడు మోటర్లు ఉంటే రెండు మాత్రమే నడుపుతున్నారని, కాళేశ్వరం కూలిందని దుష్ప్రచారం చేసేందుకు మోటార్లు నడపడంలేదని హరీష్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుంటే తాము వెళ్లి ఆన్ చేస్తామని హెచ్చరించారు. దురుద్దేశంతో మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేయడంలేదని విమర్శించారు.

# ఏడుపాయల ఆలయం జలదిగ్బంధం

(మొదటి పేజీ తరువాయి)

రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయం ముందు ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా నది దృశ్యాలను భక్తులు చూసి ఆశ్చర్యపోతున్నారు. భద్రత చర్యల్లో బాగంగా ఏడుపాయల పరిసర ప్రాంతాల్లో పోలీసులు బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నది పరిసరాలకు ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు

# ఢిల్లీలో స్పేస్ హీరో శుభాంశు శుక్లాకు ఘన స్వాగతం



**న్యూఢిల్లీ:ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా స్వదేశానికి చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో స్పేస్ హీరో శుభాంశు శుక్లాకు ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఘన స్వాగతం పలికారు. ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీతో శు క్లా భేటీ కానున్నారు.యాక్సియం–4 మిషన్‌లో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఐఎస్ఎస్)కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా జులై 15న తిరిగి భూమిపైకి చేరుకున్న విషయం తెలిసిందే. అంతరిక్షంలో ఆయన 18 రోజులు గడిపారు. మానవాళికి ఉపయోగపడే ప్రయోగాలు చేశారు. అనంతరం డ్రాగన్ క్యాప్స్‌లో కాలిఫోర్నియా సమీపంలోని సముద్ర జలాలలో జులై 15న మధ్యాహ్నం 3.01 గంటలకు ల్యాండ్ అయ్యారు.అంతరిక్ష పరిశోధన కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించారు. కాగా, భూమిపైకి చేరుకున్న ఈ వ్యోమగాయుల బృందాన్ని ఏడు రోజుల పాటు క్వారెంటైన్‌లో ఉంచనున్నట్లు స్పేస్ ఎక్స్ అధికారులు తెలిపారు.

# తారక్‌ను బూతులు తిట్టిన ఎమ్మెల్యే.. ఫ్యాన్స్ ఆగ్రహం.. ఆపై క్షమాపణ



**అనంతపురం, ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** అనంతపురం అర్బన్ టిడిపి ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ చిక్కుల్లో పడ్డారు. ప్రముఖ హీరో జూ.ఎన్టిఆర్‌ను ఆయన బూతులు తిడుతున్న ఆడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. జూ.ఎన్టిఆర్ నటించిన వార్–2 సినిమా ప్రదర్శనను ఆపేయాలంటూ సదరు ఆడియోలో ఎమ్మెల్యే వార్నింగ్ ఇచ్చారు. ఈ ఆడియో విన్న జూ.ఎన్టిఆర్ అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించారు. పోలీసులు వారిని అదుపు చేశారు.అయితే దీనిపై ఎమ్మెల్యే క్షమాపణ చెప్పారు. ఆ ఆడియో రికార్డు తనది కాదు అని ఆయన అన్నారు. లోకల్ రాజకీయాల్లో భాగంగా తనపై గిట్టని వాళ్లు చేసిన పని ఇది అని పేర్కొన్నారు. తనకు చిన్నప్పటి నుంచి నారా, నందమూరి ఫ్యామిలీలపై చాలా అభిమనం ఉందని తెలిపారు. ఎన్టిఆర్ అభిమానులు బాధపడి ఉంటే క్షమాపణలు అడుగుతున్నాను అని స్పష్టం చేశారు.అయినప్పటికీ ఫ్యాన్స్ ఆందోళన విరమించలేదు. నందమూరి ఫ్యాన్స్ లేనిదే టిడిపి లేదని అన్నారు. ఫ్యాన్స్ కన్నెర్ర చేస్తే టిడిపి ఉండదు అని.. వీళ్లను మేమే ఓట్లేసి గెలిపించామని మండిపడ్డారు. తమకు నాలుగు గోడల మధ్య చెప్పే క్షమాపణ అవసరం లేదని.. బహిరంగా ఎమ్మెల్యే అందరి ముందు క్షమాపణ చెబితేనే ఆందోళనను విరమిస్తామని హెచ్చరించారు.

# 18 సం.ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పక వేయించాలి

**• జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు**

**హన్మకొండ ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):** ఒక సంవత్సరం వయసు నుంచి 18 సంవత్సరాల వయసు లోపు గల బాల బాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పక వేయించాలని జిల్లా వైద్యశాఖ ఆరోగ్యాధికారి డాక్టర్ బి సాంబశివరావు అన్నారు. ఆదివారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమము గురించి మాట్లాడుతూ ఆగస్ట్ 11న మొదటి దఫాలో ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోని బాల బాలికలకు మాప్ అప్ డే (తిరిగి) ఆగస్ట్18 న అందజేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేయడం జరిగిందని,వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా ఈ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఒక సంవత్సరము నుండి రెండు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు సగం టాబ్లెట్ చూర్ణం చేసి నీళ్లలో వేసి త్రాగించాలని, రెండు సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయసు పిల్లలకు పూర్తి ట్యాబ్లెట్ నమిలి మింగాలని కోరినారు. పిల్లలలో నులిపురుగులు శరీరంలో ఉండడం వలన వారి శారీరక, మానసిక అభివృద్ధి జరగకపోవడం, నీరసంగా, రక్తహీనతతో చదువుపై శ్రద్ధ లేకపోవడం మొదలగు లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి ప్రతి మండల స్థాయిలో ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, టీచర్లు, సిడిపిఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎన్జీవోస్ మొదలగువారు ప్రజలలో అవగాహన కల్పించి కార్యక్రమమును విజయవంతం చేయాలని కోరారు. కేంద్రాలకు సంబంధించిన మెడిసిన్స్, ఐఇసి మెటీరియల్స్ పంపిణీ చేయడం జరిగినదని అన్నారు. ఆల్బెండజోల్ టాబ్లెట్స్ తీసుకోవడం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు



రావని, ఒకవేళ వచ్చినా వెంటనే సంబంధిత వైద్యాధికారి సిబ్బంది ద్వారా సేవలందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమమును డిఐఓ డాక్టర్ ప్రకాష్ పర్య వేక్షిస్తారని తెలిపారు. మండలాల వారీగా డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్ డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ రవీందర్, డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ అర్చన, డాక్టర్ విజయ కుమార్ మానిటరింగ్ చేస్తారని తెలిపారు.

# బీసీ సమస్యల సాధనకై ఆగస్టు 25న ఇంద్ర పార్క్ వద్ద జరిగే సత్యగ్రహ దీక్షను విజయవంతం చేయండి

**- తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నాయిని భరత్...**



**హన్మకొండ ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):**వరంగల్ మీడియా పాయింట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యాగ్రహ దీక్ష వాల్ పోస్టర్ను ఆవిష్కరించిన బీసీ నాయకులు. ఈ నెల 25 న రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో జరగబోయే 42 శాతం రిజర్వేషన్ల అమలు చేసే లక్ష్యంగా సత్యాగ్రహ దీక్షను విజయ వంతం చేయాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయిని భరత్ కోరారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ లపై రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి అధికారాలు వినియోగించుకోకుండా, కేంద్రంపై నెట్టి తప్పించుకునే మార్గాలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చిందని, సుప్రీం కోర్టులో మాండమస్ పిటిషన్ వేయాలని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే భాధ్యత విస్మరించొద్దని అన్నారు. అన్ని పార్టీల మద్దతుతో ప్రత్యామ్న్యాయ మార్గాలు వెతికి 42 శాతం రిజర్వేషన్ సాదించాలన్నా రు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుబాటు యుద్ధం తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చిత్తారి రజిత సంజీవ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పాల రంజిత్ కుమార్ గుడి కందుల వీరేశం, బీసీ నాయకులు వేముల శ్రీకాంత్, నారాయణ, బీసీ మహిళా జిల్లా అధ్యక్షురా లు తురాయి రజిని, వరంగల్ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పాల్గొన్నారు.

# నగరం ముంపుకు గురి కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి

**• ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక**

**• వరద నీటి తీవ్రత స్థాయి అంచనాకు సమన్వయంతో పనిచేయాలి**

**• భద్రకాళి బండ్, చిన్న వడ్డేపల్లి చెరువు, ఐసిసిసి కేంద్రాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన**





**హన్మకొండ ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):**నగరం ముంపుకు గురి కాకుండా ప్రణాళిక ప్రకారం శాశ్వత చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక అధికారులను ఆదేశించారు ఆదివారం బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి భద్రకాళి బండ్, చిన్న వడ్డేపల్లి చెరువు, ఐసిసిసి కేంద్రాల్లో క్షేత్ర స్థాయి పర్యటించి సమర్థవంతంగా వరద ముంపును ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రకాళి చెరువు సమీపం లో లోతట్టు ప్రాంతాల్లో ముంపు గురయ్యే ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి 12 మోరీల వద్ద వరద నీటి ప్రవాహం పరిశీలించి, అనంతరం చిన్న వడ్డపల్లి చెరువును పరిశీలించి కట్ట మల్లన్న చెరువు నుండి వచ్చే వరద నీటి వల్ల చిన్న వడ్డేపల్లి చెరువును ముంపునకు గురయ్యే సమీప ప్రాంతాలు ఎస్ఆర్ నగర్, సాయి గణేష్ కాలనీ ప్రజలను సురక్షితంగా పునరావస కేంద్రాలకు తరలించడం, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి శశాంక మాట్లాడుతూ నగరంలో వరద నీటి తీవ్రత స్థాయి అంచనాకు వివిధ విభాగాలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. వరద నీటి తీవ్రత, స్థాయిని అంచనా వేయాల్సిన అవసరం ఉందని, నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా భద్రకాళి బండ్ ఇన్ లెట్ వద్ద వాస్తవ సామర్థ్యం ఎంత? ఎంత ఇన్ ఫ్లో వస్తుంది? ఎంత ఔట్ ఫ్లో వెళు తుంది? లెవెల్స్ ఇంత ఖచ్చితంగా ఉన్నప్పటికీ ఎందుకు ఔట్ ఫ్లో వెళుతుంది? వంటి విషయాల అధ్యయనానికి ఇరిగేషన్, బల్దియా, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలు సమన్వయంతో స్ట్రీమ్ లైన్ చేసుకోవాలని సక్రమంగా లెవెల్స్, సామర్థ్యాన్ని నిర్వహిస్తూ ఇన్ ఫ్లో ఔట్ ఫ్లో కు అనుగుణంగా భద్రకాళి నిలువ సామర్థ్యాన్ని పెంచి వరద ముంపుకు గురికాకుండా నీటిని నిలువరించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రీన్ ఏరియాలోకి నీరు చేరకుండా చూడడం తో పాటు లోతట్టు ప్రాంతాలకు వరద ప్రభావితం కాకుండా చూడాలని, నీరు ప్రవహించే గరిష్ఠ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైన్ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. చిన్న వడ్డేపల్లి ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే క్రమంలో కట్ట మల్లన్న చెరువు నుండి చిన్న వడ్డేపల్లి చెరువుకు నీరు చేరే క్రమంలో మధ్యలో గల లోతట్టు ప్రాంతాల్లో ప్రధాన డ్రైన్ లు, స్ట్రాం వాటర్ డ్రైన్ లు లేకపోవడం వల్ల లోతట్టు ప్రాంతాలు మునిగి పోతున్నాయని అంతే కాకుండా ఇన్ ఫ్లో వచ్చినప్పుడు గేట్ లెవెల్స్ మేంటెన్ చేస్తూ వంద ఫీట్ల రోడ్ లో ఉన్న ఎస్ఆర్ నగర్ ప్రాంతంలో అధిక సామర్థ్యం తో మేజర్ (పెద్ద) డ్రైన్స్ నిర్మిస్తే సహజ ప్రవాహం ఎప్పటికపుడు వెళ్ళిపోయే అవకాశం ఉందని అన్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయంలో గల ఇంటి గ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేస్తూ వర్షాకాలం నేపధ్యంలో నగరంలోని ప్రతి చెరువుకు సంబంధించి నీటి ప్రవాహం ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో కు సమాచారం ప్రతి వార్డును ఎప్పటికపుడు అప్రమత్తం చేసే సమాచారం వెళ్లేల ఐసిసిసి కు అనుసంధానం చేస్తూ వాతావరణంలో సంభవించే మార్పులను ఆలారం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ చేయాలని వరద నీటి ప్రత్యేకాధికారి అన్నారు. అంతకు ముందు నగరానికి చేరుకున్న ప్రత్యేకాధికారిని కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు మహేందర్, రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డా.రాజేష్, ఈఈ రవికుమార్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదు



**హన్మకొండ ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):**ఎంసిపిఐయు నగర కమిటీ ఆధ్వర్యంలో 32 వ డివిజన్ లోని శ్రీ చైతన్య కళానికేతన్ భవన్లో కరీమాబాద్ ఏరియ కమిటీ సమావేశం ఎగ్గని మల్లికార్జున్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్ కార్యదర్శి మాలోత్ సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించ డంలో పూర్తిగా విఫల మైందన్నారు కేంద్ర బిజెపి మతోన్మాద మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చి ఎన్నికల్లోఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా సమస్యలను అడగ కుండా కార్మిక వర్గ పోరాటాలను చేయకుండా మతాన్ని ముందుకు తెచ్చి ప్రజలపై కార్మిక వర్గంపై మత విద్వేషాన్ని రెచ్చగొడుతుంది అన్నారు ఎన్డీఏ ప్రభుత్వం అధికారా లకు రాకముందు దేశంలో ఉన్న బ్లాక్ మనీ వెలుగు దీసి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 15 లక్షల రూపాయలు తమ అకౌంట్ లోకి ఏస్తామని హామీ ఇచ్చారు చదువు కున్న నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు హామీలు హామీలుగా మిగిలిపోయిన తప్ప ఏ ఒక్క సమస్యను పరిష్కారం చేయలేదన్నారు దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటు పరం చేస్తూ పెట్టుబడి దారులకు కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్మేస్తూ నిరుద్యోగము పేదరికం ఈ 10 సంవత్సరాల కాలంలో విలయతాండం అవుతుందన్నారు బిజెపి ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించడం మూలం గా భారతదేశంలో ఉన్న ప్రజా కార్మిక వర్గానికి ఎనలేని నష్టం వాటిల్లు తుందని నిత్యవసరాల సరుకుల ధరలు పెరిగి ప్రజానీకం కార్మిక వర్గం కొనలేని స్థితిలో దుర్భర మైన జీవితాలు గడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కరీమాబాద్ ప్రాంతంలో ప్రజా సమస్య లు పరిష్కరించడంలో పాలకులు ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యార న్నారు. ప్రభుత్వ భూముల లో నిలువ నీడలేని నిరు పేదలు గుడిసెలు వేసుకుంటే గతరాష్ట్ర ప్రభుత్వం గానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిచ్చి పక్క గృహాలు కట్టిస్తామని హామీలు ఇచ్చారు. అవి హామీలుగా నే మిగిలి పోయాయని అన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు కార్మిక వర్గానికి తక్షణమే నెర వేర్చాలని లేని పక్షంలో రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ సమావేశం అనంతరం కరీమాబాద్ ఏరియా జోన్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది కరీమాబాద్ ఏరియా కన్వీనర్ గా ఐతం నాగేష్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముక్కెర రామస్వామి, చుంచు జగదీశ్వర్, మల్లి కార్జున్, తిరుపతి, బావు రామస్వామి, మాలి ప్రభాకర్, అడప యాదగిరి, రాజు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి భర్త హత్యకు యత్నించిన భార్య అరెస్ట్

**• 48 గంటల్లో కేసు ఛేదించిన మట్వాడ పోలీసులు • నిందితుల వద్ద నుంచి రూ.5 లక్షల 40 వేల నగదు, ఒక కారు, రెండు ఫోన్లు స్వాధీనం**




**హన్మకొండ ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):**ప్రియుడుతో కలిసి భర్త హత్యకు యత్నించిన భార్యను, అందుకు సహకరించిన ప్రియుడిని అరెస్ట్ చేసిన ఘటన నగరం లోని మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు విలేకరుల సమావేశంలో కేసు పూర్వ పరాలను వెల్లడిస్తూ మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నపేట రఘునాధ కాలనీలో గంగర బోయిన రాజు పద్మ దంపతులు నివాస ముంటున్నారు. మూడు సంవత్సరాల క్రితం పద్మకు జమ్మికుంట మండలం మోత్కులగూడెం గ్రామానికి చెందిన పోతుల సందీప్ తో వరంగల్ బస్టాండ్ వద్ద పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త అక్రమ సంబంధానికి దారితీసింది. భర్త రాజు ఇంట్లో లేని సమయంలో పద్మ ప్రియుడు సందీప్ ని ఇంటికి పిలిపించుకొని అక్రమ సంబంధం నడిపేది. కాగా సందీప్ దగ్గర పద్మ భర్త రాజు లక్ష రూపాయల చిట్టి వేశాడు. తను లేని సమయంలో తరచూ సందీప్ ఇంటికి వస్తూ ఉండడంతో భార్య పద్మ పైన రాజుకు అనుమానం కలిగి ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో తమ అక్రమ సంబంధానికి రాజు అడ్డుగా వస్తున్నాడని ఎలాగైనా సదరు రాజును అడ్డు తొలగించుకోవాలని ఆగస్టు 14 గురువారం రోజున సాయంత్రం సందీప్ తన స్నేహితులైన బబ్లు అలియాస్ ప్రమోద్, షబ్బీర్, స్వర్ణాకర్ లతో కలిసి రాజును వరంగల్ పోతన నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతానికి తీసుకెళ్లి పూటుగా మద్యం తాగించి గొంతు నిలిమి హత్యా ప్రయత్నం చేశారు. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన రాజును చనిపోయాడనుకుని భావించి, అక్కడి నుండి ప్రియురాలు పద్మ ఇంట్లో ఉన్న తొమ్మిది లక్షల రూపాయల నగదు తెప్పించుకొని సందీప్ తో వచ్చిన స్నేహితులైన ముగ్గురికి ఒక్కొక్కరికి లక్ష చొప్పున 3 లక్షలు ఇచ్చినది. అక్కడి నుండి నిందితులంతా ఒక కారులో పరారయ్యారు. రాజు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం నగరంలోని హనుమాన్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు కారులో వస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5 లక్షల 40 వేలు, ఒక స్విఫ్ట్ డిజైర్ కారు, రెండు వివో స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 48 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసిన సిఐ కరుణాకర్ రావు, ప్రతిభ కనబరిచిన ఎస్సై బి శ్రీనివాస్, సాంబయ్య ఇతర సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్, ఏఎస్పి, డిసిపిలు ఈ సందర్భంగా అభినందించారు.

# ఘనంగా జిఎన్ఆర్ సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవం




**హన్మకొండ ఆగస్టు 17(పిసిడబ్ల్యు న్యూస్):**హనుమకొండ జిల్లా భీమారం రామారంలో ఆదివారం జి ఎన్ ఆర్ సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సూపర్ మార్కెట్ యజమాని గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సూపర్ మార్కెట్లో ప్రజలకు అవసరమైన నిత్యవసర సరుకులు అందుబాటు ధరలలో లభిస్తాయని తెలిపారు. ఇంటికి అవసరమైన నిత్యవసరాలతో పాటు గృహెూపకరణాలు కూడా తమ దగ్గర అందుబాటులో ఉన్నాయన్నారు. నగర ప్రజలు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**కరీంనగర్, ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో చికిత్స పొందిన అర్హులైన వారిని సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ముకరంపురలోని నగర కాంగ్రెస్ కార్యాలయంలో అన్నీ కలిపి అయిదు లక్షల ముప్పై వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో సహాయం అందుతుందని ఇందిరమ్మ రాజ్యం అంటే ఈ విధంగా ఉంటుందని అన్నారు.నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కరీంనగర్ నియోజక వర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.చెక్కులు పొందిన వారిలో మిర్జా ఉర్బాన,గాలిపల్లి అనూష,మంతెన విజయ,పథకాల శోభారాణి,మూల పుత్రమ్మ,రేష్మా తబసుమ్, బిషాన్ సింగ్ సర్దార్,మాచర్ల రాము,నందికొండ మణిదీప్,కాసర్ల అంజయ్య తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో శ్రవణ్ నాయక్,మూల రవీందర్ రెడ్డి,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,షబానా మహమ్మద్, నదీమ్,మాసుం ఖాన్ పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కర్ణాకర్



**చిట్యాల, ఆగస్టు 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి- దివ్య రెడ్డి. గార్ల వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో చిట్యాల మండల యూత్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్, ఉమ్మడి రేగొండ మండల అధ్యక్షుడు కోయిల క్రాంతి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు బడితల ప్రసాద్, బొమ్మ కిరణ్, జూపాక అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కృష్ణయ్య



**చిట్యాల, ఆగస్టు 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొడ్ల నరేష్ -మమత వివాహ మహోత్సవంలో రేగొండ మండలం కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జరుగగా వధూవరులను దీవించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య అలాగే కోటంచ దేవాలయ కమిటీ డైరెక్టర్ కొలపాక సాంబయ్య, మొగలపల్లి మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మరియు మాజీ సర్పంచ్ కల్లేపల్లి ప్రభాకర్ నాయకులు వనపర్తి కొండయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర



**చిట్యాల, ఆగస్టు 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన పొగల్ల లక్ష్మీ రాజేందర్ రెడ్డి గార్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాజీ సర్పంచ్లు ఎంపిటిసిలు సీనియర్ నాయకులు పాల్గొన్నారు..

# గొల్లకొండ కోటపై జెండా ఎగరేసిన బహుజన బిడ్డ సర్వాయి పాపన్న...

- మొగల్ చక్రవర్తుల వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు
- సర్వాయి పాపన్న సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి
- పాపన్నగౌడ్‌కు ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్.





**కరీంనగర్,ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** గొల్లకొండ కోటపై జెండాను ఎగరేసిన బహుజనుల ముద్దుబిడ్డ సర్వాయి పాపన్న అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. తన పోరాటాలతో మొగల్ చక్రవర్తుల వెన్నులో వణికి పుట్టించిన వీరుడని అభివర్ణించారు. సర్దార్ పాపన్న జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈరోజు బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి కరీంనగర్ శివారులో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సర్వాయి పాపన్న సేవలను కొనియాడుతూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యాంశాలు.సామాన్య కల్లుగీత కుటుంబంలో పుట్టి నాటి మొగల్ చక్రవర్తుల వెన్నులో వణుకు పుట్టించిన అసామాన్యుడు, వెన్నుచూపని వీరుడు మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. గొల్లకొండ కోటపై జెండా ఎగరేసిన మొనగాడు, బహుజనుల ఆశాదీపం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఈరోజు ఆయనను స్మరించుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది.సర్వాయి పాపన్న బడుగు, బలహీన, పేదల పాలిట ఆపద్బాంధవుడు. సమసమాజ స్థాపన సాధన కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన వీరుడు. మొగల్ చక్రవర్తులకే ముచ్చెమటలు పట్టించి గోల్కొండ ఖిల్లాపై జెండాను ఎగరేసిన కొదమ సింహం. “అమ్మా! తాటిచెట్టు ఎక్కను. లొట్టి పట్టను. గోల్కొండ ఖిల్లాపై జెండా ఎగరేయడమే నా జీవిత ఆశయం” అని తల్లికి మాటిచ్చి అనుకున్నది సాధించిన మహా వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న సర్వాయి పాపన్నకు ఆనాడు సిద్ధాంతాలు తెలియవు. ప్రపంచ విప్లవాల అధ్యయనం అసలే లేదు. ఉన్నత రాజరిక వంశ పారంపర్యం లేదు. అతి సామాన్య కల్లుగీత కుటుంబం పాపన్నది. కానీ ఆనాటి మొఘల్ చక్రవర్తుల నిరంకుశ పాలనను, స్థానిక జమిందారులు, జాగీర్ దారులు, దేశ్ ముఖ్ లు, భూస్వాముల దోపిడిని, దౌర్జన్యాలకు విసిగిపోయి ఎదిరించడానికి అతను చేసిన సాహసం ఎనలేనిది. ఒక్కనితో ప్రారంభమైన సర్దార్ పాపన్న పోరాటం సబ్బండ కులాల పీడిత ప్రజలను సమీకరించుకొని 12 వేల సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని.. గెరిల్లా పోరాటాలు చేస్తూ తన స్వస్థలం ఖిలాషాపూర్ రాజధానిగా పాలన సాగించాడు. ఛత్రపతి శివాజీ మహరాజ్, సర్దార్ సర్వాయి పాపన్న దాదాపు సమకాలీనులే. ఇద్దరూ సామాన్య కుటుంబంలో పుట్టినోళ్లే. మొఘల్ చక్రవర్తులను ఎదిరించి రాజ్యాలను స్వాధీనం చేసుకున్న వాళ్లే. కానీ ఛత్రపతి శివాజీకి దేశ చరిత్రలో దక్కిన స్థానం సర్దార్ సర్వాయి పాపన్నకు దక్కకపోవడం బాధాకరం. తాడిత, పీడిత ప్రజల కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి రాజ్యస్థాపన చేసిన సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను ప్రతి ఒక్కరూ స్మరించకపోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు కోడూరి పర్శరాములు గౌడ్, జిల్లా అధ్యక్షులు బుర్ర పర్శరాములు గౌడ్, గణగోని సత్పన్న గౌడ్, పడాల రమేశ్ గౌడ్, బుర్ర కనకయ్య గౌడ్, పతంగి అనిల్ గౌడ్, మంజూ సంపత్ గౌడ్, ముంజ ప్రశాంత్ గౌడ్, బత్తిని కన్నయ్యగౌడ్, శ్రీనివాస్ గౌడ్, రమేశ్ గౌడ్, బత్తిని రాజేశ్ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే మున్సిపల్ ఎన్నికలకు ఎంఐఎం సన్నద్ధం...

- 2028 అసెంబ్లీ ఎన్నికల వరకు ఎంఐఎంను కరీంనగర్లో బలోపేతం చేయడమే లక్ష్యం
- 500మందితో ఎంఐఎంలో చేరిన మాజీ కార్పొరేటర్ ఆరిఫ్..
- సాలార్ చౌక్ వద్ద కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్





**కరీంనగర్,ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** రాబోయే మున్సిపల్ ఎన్నికలకు ఎంఐఎం పార్టీ అన్ని అస్త్రశస్త్రాలతో పోటీకి సన్నద్ధంగా ఉందని, రెడీ కరీంనగర్ అంటూ యువత ఎంఐఎంలో చేరడానికి ఉత్సాహం చూపిస్తున్నారని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ వెల్లడించారు. ఆదివారం నగరంలోని సాలార్ చౌక్ లో ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఖాన్ పుర మాజీ కార్పొరేటర్, తెలంగాణ హజ్ కమిటీ మాజీ మెంబర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆరిఫ్ అహ్మద్, తన 500 మంది అనుచరులతో ఎంఐఎం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన ఆరిఫ్ కు, అతడి అనుచరులందరికీ గులాం అహ్మద్ హుస్సేన్ ఆకుపచ్చ కండువా కప్పి సాలార్ చౌక్ లో ఎంఐఎంలోకి ఆహ్వానించారు. సాలార్ చౌక్ నుంచి పాదయాత్రగా ఖాన్ పుర రోడ్డు మీదుగా క్రిస్టల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ కు వందలాది మంది జనంతో ర్యాలీగా తరలివచ్చారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఖాన్ పుర మాజీ కార్పొరేటర్ ఆరిఫ్, గతంలో ఎంఐఎం పార్టీలో చేరుతానని, ఎంఐఎం సిద్ధాంతాలకు, పార్టీ విధివిధానాలకు ఆకర్షితుడై గత ఆరు సంవత్సరాల క్రితం అర్జీ పెట్టుకున్నాడని, ఆరిఫ్ అర్జీ అంశాన్ని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆరిఫ్ ను పార్టీలోకి తీసుకునే అంశంపై ముందుగా నగరంలోని ఎంఐఎం పార్టీ వివిధ డివిజన్ల మెజారిటీ అధ్యక్షుల అభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. ఆరిఫ్ ను పార్టీలోకి తీసుకునే విషయాన్ని నగర కమిటీలో కూలంకషంగా చర్చించాక, మెజారిటీ డివిజన్ల అధ్యక్షులు అభిప్రాయంతో, నగర కమిటీ సభ్యులు, పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్లాక, ఆరిఫ్ ను ఎంఐఎంలోకి తీసుకోవాలని గత 15రోజుల క్రితం తమ అధినేత ఒవైసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, అనంతరం ఈరోజు ఆరిఫ్ ను ఎంఐఎం లోకి చేర్చుకోవడం జరిగిందన్నారు. ఆరిఫ్ ఎంఐఎంలో చేరడంతో కారా?నా గడ్డ ప్రాంతంలో, ఎంఐఎం మరింత బలీయమైన శక్తిగా రూపాంతరం చెందిందన్నారు. గత (5)సంవత్సరాలుగా పార్టీని దశలవారీగా నగరంలో నిర్మాణం చేస్తూ 40వ డివిజన్లలో ఎంఐఎం ను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేశామన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీని అత్యధిక డివిజన్లలో గెలిపించి, 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి కరీంనగర్లో ఎంఐఎం పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. సాలార్ చౌక్ నుంచి క్రిస్టల్ కన్వెన్షన్ వరకు దారి పొడవునా జనప్రవాహంలా మారింది. ఆరిఫ్ చేరికతో ఎంఐఎం పార్టీలో నూతన ఉత్తేజం కనిపించింది. ఉమ్మడి జిల్లాలోని మెట్ పల్లి, కోరుట్ల, జగిత్యాల, గోదావరిఖని, రామగుండం, పెద్దపల్లి ప్రాంతాల నుంచి ఎంఐఎం పార్టీ నాయకులు ఈ చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ, హాఫీజ్ యూసుఫ్, ఆతిన, ఖమరొద్దీన్, ఖాజా, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అలిబాబా, అజర్ దబీర్, ఖాజా మజారొద్దీన్, తాజొద్దీన్, సాజిద్, అసదుల్లా బేగ్, మాజిద్ హుస్సేన్ తో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి...



- ఆర్ఎస్ఎస్ కరీంనగర్ సహ సంపర్క ప్రముక్ కుమ్మరి కుంట సుధాకర్ జి.

**తిమ్మాపూర్,ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ కరీంనగర్ సహ సంపర్క ప్రముక్ కుమ్మరి కుంట సుధాకర్ జి పిలుపునిచ్చారు.త్వరలో నిర్వహించబోయే శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామంలోని ఫంక్షన్ హాల్ తిమ్మాపూర్ ఖండ స్వయం సేవకుల సమ్మేళన సమావేశం నిర్వహించారు. తిమ్మాపూర్ ఖండ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ సమావేశం లో చిగురుమామిడి, తిమ్మాపూర్,గన్నేరువరం మండలాలకు చెందిన స్వయం సేవకులతో పాటుగా వివిధ క్షేత్రాలకు సంబందించిన వారు, వివిధ పార్టీ లలో ప్రాధినిత్యం వహించే హైందవ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమ్మేళనానికి ముఖ్య వక్త గా హాజరైన కుమ్మరి కుంట సుధాకర్ జి మాట్లాడుతూ 1925 అక్టోబర్ 2 నాగ్ పూర్ లో ప్రారంభించబడిన సంఘం ఈ ఏడాది అక్టోబర్ తో 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నదని పేర్కొన్నారు. కేవలం నలుగురు వ్యక్తులతో ఏర్పాటు చేయబడిన సంఘం నేడు లక్షలాది మంది స్వయం సేవకులతో విరాజిల్లుతున్నదని తెలిపారు.ఒకలక్ష్యం తో 100 ఏళ్లుగా కొనసాగుతున్న ఏకైక సంస్థ ఆర్ ఎస్ ఎస్ అని పేర్కొన్నారు.డా కేశవరామ్ హెగ్డేవర్ లాంటి వ్యక్తులతో స్థాపించిన సంఘం ఈ రోజు భారత దేశంలో ఒక శక్తిగా అవతరించిందని అన్నారు. దేశానికి మనమేమిస్తున్నామనే బృహత్తర ఆలోచననే సంఘం సమాజానికి సూచిస్తున్నదని తెలిపారు. రాబోయే శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఖండ స్థాయిలోని ఉప మండలాల గ్రామాల్లో శాఖ కార్యక్రమాలను నిరంతరంగంగా నిర్వహించడం, ప్రతీ ఇంటికి వెల్లి సంఘం లక్ష్యాలను వివరించడం, దసరా ఉత్సవాలలో హైందవ సమాజాన్ని పాత్రులను చేయడం, పథ సంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించడం లాంటి లక్ష్యాలను విజయవంతం చేసే దిశగా ప్రతీ స్వయం సేవక్ కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశం లో ప్రాంత సామాజిక సమరత సహ కార్యదర్శి పుల్లూరి రామారావు, ఖండ కార్యవాహ ఆవుల కుమార్ జి, జిల్లా శారీరక్ ప్రముక్ కాముటం వినీత్, జిల్లా సేవా ప్రముక్ సంపత్ జి, నర్సింగ్ జి తదితరులు పాల్గొన్నారు.



## నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్సై సురేష్‌పై సస్పెన్షన్ వేటు



**నీల్వాయి ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.సురేష్ పై సస్పెన్షన్ వేటు పడింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో జోక్యం చేసుకున్న ఆయన,బాధితుడిని లంచం కోరినట్లు ఆరోపణలు వచ్చాయి. లంచం ఇవ్వలేదనే కారణంతో బాధితుడిని చితిక బాధలంతో బాధితుడు అల్గం కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు దర్యాప్తు జరిపి,ఆరోపణలు నిజమని నిర్ధారించడంతో ఎస్సై సురేషన్ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నెల రోజుల క్రితమే నీల్వాయి పోలీస్ స్టేషన్కి బదిలీ అయిన సురేష్,వివిధ అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవడంతో పాటు పలువురిని చితకబాదినట్లు బాధితులు తెలపడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందచేసిన ఎస్ఐ శ్రావణ్ కుమార్



**చిట్యాల,ఆగస్టు 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని నైన్ పాక గ్రామానికి చెందిన ఉడుత మోహన్ 5నెలల క్రితం తన శామ్సంగ్ ఫోన్ని పోగొట్టుకొని చిట్యాల పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ లాల్ సింగ్ అట్టి మొబైల్ CEIR పోర్టల్ ద్వారా అట్టి అట్టి మొబైల్ ని హైదరాబాద్ లో గుర్తించగా ఎస్సై అట్టి మొబైల్ ఫోన్ని ఉడుత మోహన్ బాధితుడికి అందించడం జరిగింది

## వివిధ శుభకార్యాలలో పాల్గొన్న టిఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్.








**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు,కాలనీలలో జరిగిన నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, వివాహ మహోత్సవాలు వంటి శుభకార్యాల్లో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొని వధూవరులకు, గృహప్రవేశం చేసిన కుటుంబాలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజల సంతోషాల్లో భాగస్వాములవుతూ, ఆనంద క్షణాలను పంచుకోవడం ద్వారా ప్రజలతో ఆప్యాయత బంధాన్ని మరింత బలపరచుకున్నారు.ప్రతి శుభసందర్భంలో ప్రజలతో కలసి ఉండడం మన సంప్రదాయాన్ని, మన బంధాన్ని మరింతగా బలపరుస్తుంది అని ఆయన అన్నారు.

## ఇస్నాపూర్ కుర్మ సంఘం నూతన అధ్యకుడు కృష్ణని సన్మానించిన గడీల శ్రీకాంత్ గౌడ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి పటాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని బీరప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఇస్నాపూర్ కుర్మ సంఘం నూతన అధ్యక్షుడు కంచిగారి కృష్ణ గారిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన పటాన్ చెరు మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వెంకటేష్,మల్లేష్, గోపాల్,ఆలయ కమిటీ సభ్యులు సత్తయ్య,మానయ్య,ఒగ్గు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్‌లోని పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సంగారెడ్డి లోని తన నివాసంలో అందోల్ నియోజక వర్గం లోని అన్ని మండలాలలో పంచాయత్ రాజ్ శాఖ అద్వర్యం లో చేపట్టుతున్న నూతన రోడ్ల నిర్మాణం,మరమ్మత్తులు, టీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు,పునర్ నిర్మాణ పనులపై పంచాయితీ రాజ్ శాఖ సంగారెడ్డి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షలో అందోల్ నియోజక వర్గం లో పంచాయిత్ రాజ్ శాఖ అద్వర్యం లో సుమారు 44 కోట్ల రూపాయలతో చేపట్టుతున్న రోడ్ల అభివృద్ధి పనులు,నూతన రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులు,సి సి రోడ్ల నిర్మాణం,హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణ పనులు,గ్రామపంచాయితీ భవనాల నిర్మాణం,అంగన్వాడీ భవనాల నిర్మాణం,మరమ్మత్తులు, గ్రామీణ ఉపాధి పథకం లో చేపట్టుతున్న పనులు,ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు,పునర్ నిర్మాణ పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా పంచాయితీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో పంచాయితీ రాజ్ శాఖ జగదీశ్వర్, అంజయ్య,తదితరులు పాల్గొన్నారు

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ పట్లోల్ల ఆదిత్య రెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి ఇటీవల వరుసగా జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇంద్రేశంలోని పీఎమ్ఆర్ గార్డెన్ లో జరిగిన లక్ష్మి, శ్రీకాంత్ వివాహ వేడుకలో ఆదిత్యరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కొంపల్లిలోని చంద్రారెడ్డి గార్డెన్ లో జరిగిన మనీకాంత్ రెడ్డి, కావేరి వివాహానికి హాజరైన ఆయన, వధూవరులను ఆశీర్వదించి సుదీర్ఘ దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో పలువురు సన్నిహితులు,బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అదేవిధంగా, శంషాబాద్ లోని జిఎమ్ఆర్ గార్డెన్ లో జరిగిన శివచరణ్ రెడ్డి, దివ్య రెడ్డి వివాహ వేడుకలో పాల్గొన్న ఆదిత్యరెడ్డి, వధూవరులను ఆశీర్వదించి, సుఖశాంతులతో, సంతోషకరమైన జీవితాన్ని గడపాలని కోరుకున్నారు.తదుపరి అతిధి కన్వెన్షన్ లో జరిగిన జ్ఞానేశ్వర్, నిఖిత వివాహ వేడుకలో పాల్గొన్న ఆయన, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఇద్దరి జీవితం పరస్పర అర్థం, ప్రేమ, సఖ్యతలతో సాఫల్యవంతం కావాలని ఆశీర్వదించారు.ఈ వేడుకలన్నింటిలో ఆదిత్యరెడ్డి పాల్గొనడం వలన వధూవరులు, కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. యువతలో ఆయన సరళత, ఆత్మీయత మరియు అందరితో కలిసిపోవాలనే స్వభావం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయించాలి

- సిపిఎమ్ నాయకులు సుధాకర్ డిమాండ్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గంలోని బానూర్ నుండి క్యాసారం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు వర్షానికి కొట్టుకుపోవడం, గుంతలు పడడం వల్ల ఉద్యోగాలకు వెళ్లి ప్రజలకు, రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. సంబంధిత అధికారులు వెంటనే చొరవ తీసుకొని రహదారి మరమ్మతులు చేపట్టాలని సి పి ఎమ్ నాయకులు సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆదివారం గుంతలు పడిన రోడ్డును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముందే రోడ్లను మరమ్మతు చేయాల్సిన అధికారులు నిద్రపోతున్నారని ఆయన ప్రశ్నించారు.రోడ్లు బాగా లేకపోవడం ద్వారా ప్రయాణం చేసే ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోజురోజుకి అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.ప్రమాదల వల్ల కాళ్లు చేతులు పోగొట్టుకోవడం అనే పరిణామాలు పెరుగుతున్నాయి. అనేక గాయాలు అవుతున్నాయని ఆయన అన్నారు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి రోడ్డుకు మరమతు చేయకపోతే సిపిఎం పార్టీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం ఏరియా కమిటీ నాయకులు సుధాకర్, యాదగిరి, లక్ష్మారెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## లింగంపల్లి నుండి అమీన్పూర్‌కు వెళ్ళే రోడ్డు గుంతలను వెంటనే పూడ్చాలి

- రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలి
- ప్రభుత్వము, ప్రజాప్రతినిధులు నిద్రపోతున్నారా
- లక్షల మంది సమస్యలు పరిష్కరించడం చేతకాదా
- 150 కాలనీల సమస్య వెంటనే పరిష్కరించాలి
- మరమ్మతులు చేయాలని సిపిఎం నిరసన
- సమస్యను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం
- సిపిఎం నేత కే రాజయ్య హెచ్చరిక



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):**సిపిఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం లింగంపల్లి నుండి అమీన్పూర్ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు గుంతలను పూడ్చాలని,రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బంధం కొమ్మ వద్ద నిరసన కార్యక్రమం చేయడం జరిగింది,భారీ ఎత్తున కార్యక్రమం జరిగింది,ఈ సందర్భంగా సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే రాజయ్య మాట్లాడుతూ రోడ్డు గుంతలను వెంటనే పూడ్చాలని,విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రోడ్డు సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తమని ఆయన హెచ్చరిక చేశారు, లింగంపల్లి నుండి అమీన్పూర్ వెళ్లే దారిలో 150 పైన కాలనీలు ఉన్నాయని,బంధన్ కొమ్ము, అమీన్పూర్ తో పాటు బాచుపల్లి పోయే రహదారి ఇది అని ఆయన అన్నారు, 5 లక్షల మంది ప్రజలు ఉన్నారని, ఇంత తీవ్రమైన సమస్య ఉన్నప్పుడు ప్రభుత్వం ఎందుకు నిద్రపోతుందని, ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని ఆయన సూటిగా ప్రశ్నించారు, వర్షాలు పడడం ద్వారా గుంతలు మరింత పెద్దగా అయినా గుంతలను పట్టించుకునే నాధుడే లేదని, మరమ్మత్తులు ఎందుకు చేయట్లేదని ఆయన అన్నారు, మున్సిపల్ అధికారులు నిద్రలో పోతున్నారని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఏం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ రోడ్డు కుండా ప్రయాణం చేస్తే ప్రమాదాలు జరిజి అనేకమంది రోజు గాయపడుతున్నారని, హాస్పిటల్ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, కాలు, చేతులు విరుగోతున్నాయని ఆయన అన్నారు. ప్రాణాలు సైతం పోయే పరిస్థితి వస్తుందని ఆయన అన్నారు, ప్రజలు ఇంత ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఎందుకు చలనం లేదని, స్పందించలేదని ఆయన అన్నారు. బంధన్ కొమ్ము,అమీన్పూర్,బాచుపల్లి కి వెళ్లే ఈ రోడ్డులో వేలాది వాహనాలు ,టూ వీలర్స్ ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తున్నాయని అన్నారు, గుంతలు పూడ్చడం కూడా ఈ ప్రభుత్వానికి చేత కావడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు, గుంతలను వెంటనే పూడ్చాలని, గతంలో ప్రభుత్వము రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నమని ప్రకటించిన ఎందుకు విస్తరణ ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. రోడ్డు గుంతలను పూడ్చాలని, విస్తరణ పనులు ప్రారంభించాలని లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగేశ్వరరావు,శ్రీధర్,పెంటయ్య,ధనరాజు, వెంకటేశ్వరరావు,నాగులు భాషా ,నరేందర్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీరోల్ మండల ఆర్యవైశ్య అధ్యక్షులు ఏకగ్రీవం ఎన్నిక

- మండల అధ్యక్షులుగా ప్రతాపని పుల్లయ్య





**మహబూబాద్ జిల్లా సీరోల్ ఆగస్టు 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కళ్యాణ మండపంలో ఆదివారం రోజున జరిగిన ఆర్యవైశ్య మండల రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు మహబూబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తల్లాడ వెంకట రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు ఓబిల్లి శెట్టి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సీరోల్ మండల ఆర్యవైశ్య ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైన ఆర్యవైశ్య మండల అధ్యక్షులుగా తాళ్ల సంకీస గ్రామానికి చెందిన ప్రతాపని పుల్లయ్య, కొత్తూరు సీ. గ్రామానికి చెందిన ప్రధాన కార్యదర్శి గా కొండ్లె శ్రీనివాస్, గౌరవ సలహాదారులు అరవపల్లి రంగయ్య, తల్లాడ మోహన్ రావు, ఉపాధ్యక్షులు వేమిశెట్టి రంగయ్య, ప్రొద్దుటూరు నాగేశ్వరరావు, కాశీపతి, ఆకుల విజయ్ కుమార్ కార్యవర్గ సభ్యులు గరిపెల్లి శ్రీనివాస్ దారం అంబరీష తల్లాడ శ్రీనివాస్ ప్రొద్దుటూరు సత్య నారాయణ, వేమిశెట్టి నరసయ్య కొత్త శ్రీనివాస్ కొండ్లె సీతారాములు వేమిశెట్టి వెంకన్న చల్ల శ్రీ కుమార్ చల్ల శ్రీకాంత్,ఆర్యవైశ్య సీరోల్ మండల మీడియా ఇంచార్జి చల్ల వేణు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రతాపని పుల్లయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య మండల అధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఆర్యవైశ్య సభ్యులందరికీ, జిల్లా కమిటీ వారికి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

# అనాథ వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషకరం

**● పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి**



**వేంపల్లె ఆగస్టు 17 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** వృద్ధాశ్రమంల్లో ఉన్న అనాథ వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషకరమని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్త రవి కుమార్ కు కవల పిల్లలైన కేతన్, కేతనల పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్థానిక గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధుల మధ్య పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి విచ్చేసి కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. అలాగే వృద్ధులకు అన్నదానం చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ-ప్రార్థించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న అని మదర్ థెరిస్సా చెప్పినట్లు ఆయన చెప్పారు. అలాంటి మదర్ థెరిస్సా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేయడం మహాభాగ్యంగా ఉందన్నారు.మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు విజయ మోహన్ రెడ్డి, ఆల్ఫిన్స్ రెడ్డి, చిన్నప్పరెడ్డిలు ఆశ్రమం పెట్టి అనేక సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రవికుమార్ తన బిడ్డల పుట్టిన రోజునా వృద్ధుల అన్నదానం చేయడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, హన్సికా రెడ్డి, నాగరాజు, వినయ్, రవి కుమార్, కేతన, విజయమోహన్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు

# రైతుల యూరియా సమస్యను పరిష్కరించాలి

**● ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సరిపడా యురియాను అందించాలి ● పలు సహకార సంఘాల కేంద్రాలను సందర్శించిన మానవ హక్కుల సంఘం అధ్యక్షులు మంగళపల్లి హుస్సేన్**





**మహబూబాబాద్ జిల్లా ఆగస్ట్ 17 (పీసిడబ్ల్యు న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలో పలు రైతువేదికలు,సహకార సంఘాల కేంద్రాలను సందర్శించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫర్ జస్టిస్ జాతీయ అధ్యక్షులు మంగళపెల్లి హుస్సేన్ సందర్శించా రు.రైతులకు సరిపడా యురియా అందించాలంటూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి,నెల్లికుదురు, తొర్రూర్, మరిపెడ,డోర్నకల్, కురవి,కేసముద్రం, మహబూబాబాద్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల వద్ద,సహకార సంఘాల కేంద్రాల ఎదుట రహదారి పై రైతులు రాస్తారోకో చేపట్టాల్సిన ఖర్మ ఏంటని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు కలెక్టర్ వెంటనే సత్వర చర్యలు తీసుకుని రైతుల సమస్యలు తీర్చాలని నేషనల్ హ్యూమాన్ రైట్స్ ఫర్ జస్టిస్ జాతియ అధ్యక్షులు మంగళంపల్లి హుస్సేన్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో మొక్క జొన్న, వరి సాగు చేసే రైతులకు సరైన సమయములో యూరియా ఎంతో అవసరమవుతున్న నేపథ్యంలో ఎరువుల కోసం రైతులు క్యూలైన్ లో నిల్చోవాల్సిన దుస్థితి,ధర్నాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యా యని ద్వజమెత్తారు.రైతులకు తమ ఆధార్ కార్డుకు రెండు బస్తాలు యూరియా అందచేయడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నరన్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సరిపడా యురియాను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బద్దె వీరభద్రం, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు గాదె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రాచమల్లును విమర్శించే స్థాయి ప్రవీణ్‌కు లేదు



**ప్రొద్దుటూరు ఆగస్టు 17 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మాజీ ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి ప్రవీణ్ కు లేదంటూ పట్టణ వైసీపీ అధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి తెలిపారు.ఆదివారం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పదే పదే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ను చెల్లని రూపాయి అంటున్న ప్రవీణ్ వైసీపీ పార్టీ ఆవిర్భావం నుండి ప్రతి ఎన్నికలలో ప్రొద్దుటూరు నుండి ప్రాతినిధ్యం వహించి 2 సార్లు ఎమ్మెల్యే గా గెలిచి, ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పనిచేస్తున్నారనే విషయం గుర్తించాలని వివరించారు. ప్రతిసారీ ప్రవీణ్ తన పై వైసీపీ పాలనలో అక్రమ కేసులు బనాయించారని అంటున్నారని, కాగా డ్వాక్రా మహిళలను మోసం చేసిన, మహిళ తరపున వాకాల్తా పుచ్చుకున్న ప్రవీణ్ ను డ్వాక్రా మహిళలు డబ్బు చెల్లించాలని కోరితే దాడి చేసిన సంఘటనలో తమ పార్టీకి చెందిన 17 మందిపై, టిడిపి వారిపై ప్రవీణ్ తో సహా 9 మందిపై కేసు నమోదు చేశారని తమలో కొందరు ముందస్తు బెయిల్ తెచ్చుకోగా 5 మంది తమ ప్రభుత్వంలోనే సబ్ జైలుకు వెళ్లారని స్పష్టం చేశారు. మరో కేసు తమ పార్టీ కార్యకర్త బెనర్జీ పై టిడిపి కార్యకర్తలు దాడి చేసిన కేసులో ఇరువురు పాత్రధారులపై, సూత్రధారి ప్రవీణ్ పై కేసు నమోదు చేశారే తప్పా ఇక్కడ అక్రమ కేసులు కాదని వివరించారు. ప్రవీణ్ కేవలం అతని స్వలాభం కోసమే లోకేష్ కలిశారని, అతను కలవడం వలన ఒక్క రూపాయి నిధులు కూడా రాలేదని, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అప్పటి సీఎం జగన్ ను కేవలం 4 సార్లే కలిసినా 750 కోట్ల రూపాయల నిధులు ప్రొద్దుటూరుకు తెప్పించారని వివరించారు. ఇటీవల ఓ ఎర్రచందనం కేసులో ప్రవీణ్ ముఖ్య అనుచరుడు అరెస్టు అయ్యారని, ఇందులో ప్రవీణ్ పాత్ర ఏమిటో తెలపాలన్నారు. ఇకనైనా ఇటువంటి విమర్శలు మాని, ప్రొద్దుటూరు అభివృద్ధి పై దృష్టి సారించాలని సూచించారు.

# ఎడ్జెర్ల చెరువు పురుషోత్తమగూడెం బ్రిడ్జిని సందర్శించిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్

**మహబూబాబాద్ జిల్లా ఆగస్టు 17 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** గత రెండు రోజుల నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడ్జెర్ల చెరువు పురుషోత్తమ గూడెం బ్రిడ్జి ని సందర్శించిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్ మాట్లాడుతూ జిల్లా కురుస్తున్న భారీ వర్షాల వలన వాగులు, చెరువు లు ఉధృతంగా ప్రవహిస్తున్నందున స్థానిక ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీట మునిగిన రోడ్లు,వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, చేపాల వేటాకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు చెరువులు,వాగులు దాటవద్దని, యువకులు సెల్ఫీల కోసం నీటి ప్రవాహం వద్దకు వెళ్లవద్దనిసూచించారు. అనవసర ప్రయాణాలు చేయవద్దు అని సూచించారు అత్యవసర సమయాల్లో డయల్ 100కు, స్థానిక పోలీసులకు, సమాచారం ఆందిచాలని సూచించారు. వాగుల వద్ద పోలీస్ పెట్రోలింగ్ పెంచి ప్రమాద హెచ్చరికలను తెలియజేసేలా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెరువులు,వరద నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని వంతెనలు, చప్టలపై బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాల భారీన పడకుండా వాహనాల రాకపోకలను నిషేధిం చడం జరిగిందని సూచించామని తెలిపారు.అలాగే రాబోయే రెండు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పట్లతో పోలీస్ అధికారులను, సిబ్బందిని సిద్ధం చెయ్యడం జరిగిందనీ, ప్రజలు కూడా గ్రామాలలో, పట్టణాలలో పాత ఇళ్లు, గుడిసెల్లో, శిథిలావస్థలో ఉన్న నివాసలలో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.అలాగే ఎడ్జెర్ల వాగు పరివాహక ప్రాంతం ,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గొర్రెలు, పశువులు కాపరులు అటువైపు గానీ , వాగులు, వంకలు వైపు వెళ్లవద్దని, గ్రామాలలో కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకునేందుకు బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించిచారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాము అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితుల్లోఈ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము అని తెలిపారు.అలాగే వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కల్వర్టు, బ్రిడ్జిలు నీటిమునిగే ప్రమాదం ఉన్నందున, వరద నీటి ఉధృతిని అంచనా వేయకుండా నదులు, వాగులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయకూడదు అన్నారు .వర్షాల కారణంగా ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకుండా, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం ప్రజలు 100 నంబర్‌కు కాల్ చేయవచ్చు అన్నారు. ఎస్పీ వెంట సీఐ రాజ్ కుమార్ ,ఎస్ఐ గార్ల , సిబ్బంది ఉన్నారు.



# కార్యవర్గం అందిస్తున్న సేవలు ప్రశంసనీయం

**పాస్టర్ రెవరెండం మోహన్ బాబు**




**కడప ఆగస్టు 17 (పి.సి.డబ్ల్యూ న్యూస్):-** కడప నగరంలోని అతి పురాతమైన చర్చిగా పేరొందిన కాంగ్రి గ్రేషనల్ చర్చి కమిటీ కార్యవర్గం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని క్రైస్తవ ప్రముఖులు పాస్టర్ రెవరెండ్ మోహన్ బాబు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూకాంగ్రిగేషనల్ చర్చి 200 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంతోపాటు నూతన భవన ప్రారంభాన్ని పురస్కరించుకుని క్రైస్తవ గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో అతి పురాతన చర్చిగా కాంగ్రి గేషనల్ చర్చికి విశేష గుర్తింపు ఉందన్నారు. నాడు లండన్ మిషనరీ వారు ఏర్పాటు చేసిన ఈ చర్చి కాలక్రమంలో అభివృద్ధి చేస్తూ భక్తుల ప్రార్థనలతో అలరారుతోందన్నారు. విశ్వాసుల ప్రార్థనలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు చర్చిని అన్ని విధాల అభివృద్ధి చెందేలా కృషిచేస్తున్న చర్చికమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. చర్చి పెద్దలు, సంఘస్తుల సహకారంతో కార్యవర్గం అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ విషయంగా తమవంతుగా తోడ్పాటు అందిస్తున్న ప్రతి ఒక్కరినీ పేరుపేరున అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ యు సంజీవ రాయుడు, సెక్రెటరీ విజయుడు, ట్రెజరర్ సిహెచ్ నోవా బెన్నీ, డికాన్ రాజ మనోహర్ బాబు, డికాన్ కే టి బి. ప్రసన్నకుమార్, ఆశీర్వాదం, సుశీలమ్మ జయ కుమార్, మోహన్ చర్చి కమిటీ ప్రతినిధులు, క్రైస్తవ పెద్దలు, పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

# మరిపేడ పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి, ఎడ్జెర్ల, పెద్ద చెరువులను సందర్శించిన అదనపు కలెక్టర్



**మహబూబాబాద్ జిల్లా ఆగస్టు 17 (పిసి డబ్ల్యూ న్యూస్):**ఆదివారం రోజున జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్,జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యం జిల్లాలో వరదల వలన సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ స్థాయి నుండి ప్రత్యేక అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది వరకు క్షేత్రస్థాయిలోనే ఉంటూ స్థానిక పరిస్థితులను గమనిస్తూ ముందస్తు చర్యలు తీసుకొని సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం, మంత్రి ఆదేశించినందున ఆదివారం అందరూ వారికి కేటాయించిన ప్రదేశాలలో విధులలో ఉన్నారు.కలెక్టర్ గార్ల మండలం రామాపురం లో లెవెల్ వంతెన, సీతంపేట పెద్ద చెరువు, లను సందర్శించి వరద పరిస్థితిని సమీక్షించారు, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రత్యేక అధికారి హరి ప్రసాద్, తహసిల్దార్, ఎంపీడీవోలకు సూచించారు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, బయ్యారం మండలం, పెద్ద చెరువు, నామాలపాడు (లో లెవెల్ వంతెన) గార్ల, డోర్నకల్ మండలం ములకలపల్లి వంతెన, మరిపేడ పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి, ఎడ్చెర్ల, పెద్ద చెరువు, లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.అలాగే (18) మండలాల ప్రత్యేక అధికారులు మండల స్థాయి బృందం తో కలిసి చెరువులు, కుంటలు ,వాగులు, వంతెనలు, బ్రిడ్జిలు తదితర అన్ని సమస్య ఆత్మక ప్రాంతాలు తనిఖీ చేస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించడం జరుగుతు ందని, సామాన్య ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.జిల్లాలో రేపటి వరకు రెడ్ అలర్ట్ ఉన్నందులో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించినందున, అందరూ అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందా అన్నారు.ఇప్పటికే జిల్లాలో విపత్తుల నివారణ సిబ్బంది, ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అధికారులు హెడ్ క్వార్టర్ మైంటెన్ చేస్తూ ఉన్నారని పూర్తిస్థాయిలో ప్రస్తుతానికి జిల్లా లో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని కలెక్టర్ అన్నారు.ప్రత్యేక అధికారులు శ్రీనివాసరావు, హరిప్రసాద్, డాక్టర్ కిరణ్ కుమార్, స్థానిక తహసీల్దారులు నాగరాజు, కృష్ణవేణి, శారద, ఎంపీడీవోలు, సంబంధిత ఇరిగేషన్ ఆర్ అండ్ బి సిబ్బంది ఉన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలే శరణ్యం

**● రైతులకు సరిపడ యూరియా అందించడంలో ప్రభుత్వ వైఫల్యం ● ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

**నర్సంపేట ఆగస్టు 17,(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించడంలో రైతులకు సరిపడా యూరియా అందించడం ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ప్రజా పోరాటాలు సమస్యలకు పరిష్కారం చూపుతాయని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) నర్సంపేట డివిజన్ కమిటీ సమావేశం కామ్రేడ్ గటికే జమున అధ్యక్షతన నర్సంపేట ఓంకార్ భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో రైతులకు కావలసిన ఎరువులు రుణాలు సమకూర్చడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధి ప్రదర్శించకుండా వైఫైల్యం చెందాయని ఈ క్రమంలో రైతాంగం యూరియా కోసం అష్ట కష్టాలు పడుతున్నారని కొంతమంది దళారులు దొడ్డి దారిన ఎక్కువ ధరకు విక్రయిస్తున్న పట్టించుకునే నాధుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పూర్తి




స్థాయిలో రుణమాఫీ చేయకపోవడం వల్ల బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని ఉన్నతాధికారులు కలగజేసుకొని రైతులకు పంట రుణాలు ఇప్పించాలని కోరారు. మరోవైపు అధిక వర్షాల వల్ల నీరు నిలిచి దోమలు ఇతర క్రిమి కీటకాలు వ్యాపించి సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడుతుంటే ముందస్తు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. గ్రామాల్లో స్థానిక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని తక్షణమే నిధులను కేటాయించి పరిష్కారానికి దారి చూపించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో గుర్తించి పోరాటాలను చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజసాయబ్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయాలని రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న కుసుంబ బాబురావు నాగెల్లి కొమరయ్య డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి డివిజన్ నాయకులు కేశెట్టి సదానందం కలకోట్ల యాదగిరి దామ సాంబయ్య బుడిమే సురేందర్ అల్లి సాబ్ కర్నే సాంబయ్య మార్త నాగరాజు బత్తిని కుమారస్వామి డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్టు 18 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ శ్రీమతి ఎన్.మౌర్య ఐఏఎస్ గారు తెలియజేశారు

# ప్రజల ప్రయోజనాన్ని మరిచి కమిషన్ల కక్కుర్తితో కొనసాగిన బిఆర్ఎస్ పాలన...

**● డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ● తెలంగాణ ప్రజల పాలిట కాళేశ్వరం గుది బండగా మార్చింది బిఆర్ఎస్ కాదా? ● పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్.**

**కరీంనగర్,ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** నిన్న బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ చొప్పదండి నియోజకవర్గంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌస్ సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీపై చేసిన విమర్శలను ఖండిస్తూ నేడు డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పాలిట కాళేశ్వరం గుడిబండగా మార్చింది టిఆర్ఎస్ కాదా ఆ విషయం మాజీ ఎంపీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ కి తెలియదా అని పులి ఆంజనేయులు గౌడ్ మండిపడ్డారు. నిన్న చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం గాయత్రి పంప్




హౌస్ ను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తో కలిసి వినోద్ కుమార్ సందర్శించి కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేశారు, కంటికి కనిపించే గాయత్రి పంప్ హౌస్ నీరు మాత్రమే చూపించిన వినోద్ కుమార్ కి దానివల్ల తెలంగాణ ప్రజలపై ఎంత భారం పడుతుందో తెలియదా అని ప్రశ్నిస్తూ, కాగ్ నివేదిక ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం 81వేల 9వందల 11కోట్ల రూపాయలతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్ట్ అది పూర్తి అయ్యేసరికి ఒక లక్ష 47 వేల కోట్ల రూపాయల ఖర్చయిందని వినోద్ కుమార్ కి తెలియదా, కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మోటర్లు ఆన్ చేస్తే ఒకరోజు మొత్తం తెలంగాణ ప్రజలు వినియోగించే విద్యుత్ వినియోగంతో సమానం అనే విషయం మర్చిపోయారా సంవత్సరానికి ?10,000, 600 కోట్ల రూపాయలు కేవలం విద్యుత్ వినియోగానికి ఖర్చవుతుంటే వినోద్ కుమార్ మేం ఏదో పెద్ద ఘనకార్యం చేశామని చెప్పుకుంటున్నారు. ఒక రైతు ఎకరానికి కాళేశ్వరం నీరు అందాలంటే 46వేల 632 రూపాయల ఖర్చు అవుతుంది అంటే తెలంగాణ రైతుల మీద ఎంత భారం పడుతుందో ఆయన అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు అని దుయ్య బట్టారు, డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఆధారంగా ఒక యూనిట్ ఖర్చుకి మూడు రూపాయలు అవుతుందని చెప్పి మీరు ప్రజలను మభ్య పెట్టారు కానీ వాస్తవానికి ఇప్పుడు చూస్తే ఆరు రూపాయల 42 పైసలు ఖర్చు అవుతున్న మాట నిజం కదా వినోద్ కుమార్ చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు 6000 కోట్ల రూపాయలతో ఖర్చు చేస్తే నేషనల్ జియాలజికల్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ అక్కడ భూకంపం వచ్చే అవకాశం ఉందని హెచ్చరించినా కూడా కేవలం కమిషన్ల కోసం మాత్రమే హడావుడిగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంని నిర్మించడం వల్లనే ఈరోజు కాళేశ్వరం పిల్లర్లు పగిలిపోయాయి. అది చూసి రేవంత్ రెడ్డి పంద్రాగస్టు వేదికగా వాళ్ల లోపాలని ఎత్తి చూపిస్తే భరించలేని టిఆర్ఎస్ నాయకులు గగోలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. తమ అవినీతి వైఫల్యాలను కప్పి పుచ్చుకుంటూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను, విమర్శలను తెలంగాణ ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదని బిఆర్ఎస్ కథ కంచికి చేరిందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామిడి రాజిరెడ్డి, వంగల విద్యాసాగర్, కంకణాల అనిల్ కుమార్, నూనె గోపాల్ రెడ్డి, నెల్లి నరేష్, సయ్యద్ జమాలుద్దీన్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యాడికి కాలువకు జలహారతి కార్యక్రమం నిర్వహించిన తాడిపత్రి శాసనసభ్యులు జె.సి. అస్మిత్ రెడ్డి



**యాడికి ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** యాడికి మండలం ఇటీవల కురిసిన వర్షాలకు యాడికి కాలువకు నీరు రావడంతో తాడిపత్రి శాసనసభ్యులు జె.సి. అస్మిత్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి కాలువను పరిశీలించడం జరిగినది. అనంతరం స్థానిక మహిళలతో కాలువకు జలహారతి కార్యక్రమాన్ని శాసనసభ్యులు అస్మిత్ రెడ్డి నిర్వహించారు. యాడికి కాల్వకు నీరు రావడంతో స్థానిక రైతులు భూగర్భ జలాలు పెరుగుతాయని ఆనందం వ్యక్తం చేసినారు తాడిపత్రి శాసనసభ్యులు సొంత నిధులతో కాలువలో పూడికతీత పనులు నిర్వహించడంతో వర్షాలకు కాలువలో నీరు పారుచున్నాయని రైతులు తెలిపారు. తాడిపత్రి శాసనసభ్యులు అస్మిత్ రెడ్డి యాడికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

**● ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాసాల కుమార్ యాదవ్ ● శ్రీ గోకుల యాదవ సంఘం అధ్యక్షులు మూడేత్తుల మల్లేష్ యాదవ్**

**మేడ్చల్ మల్కాజ్గిరి,ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల క్రాంతి కాలనీ లో గల కుండ పోచమ్మ తల్లి ఆలయం వద్ద గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు చిన్ని కృష్ణుడు గోపికమ్మ వేషధారణలో అలరించారు. యాదవ సంఘం నాయకులు చిన్నారులతో పాటు ఉట్టి కొడుతూ సందడి చేశారు. నేటి తరం యువకులకు రేపటి తరం చిన్నారులకు మన సంస్కృతి సంప్రదాయాలు, శ్రీకృష్ణ పరమాత్ముని లీలలు,



గోకులాష్టమి విశిష్టతను తెలపడానికి ఎటువంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని వేడుకల్లో పాల్గొన్న అతిథులు అన్నారు. శ్రీకృష్ణ పరమాత్ముడు చిన్నతనం నుంచి అనేక లీలలు చూపించాడని ఆయన చూపిన ప్రతి లీలలు ఏదో ఒక పరమాత్మ దాగి ఉండి లోకానికి మేలు చేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనిస్తూ గోమాతను పూజించాలని, మన సంస్కృతికి అద్దం పట్టే



పండుగలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రతినిధులు తెలిపారు. శ్రీ గోకుల యాదవ సంఘం అధ్యక్షులు మూడేత్తుల మల్లేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, చెంగిచెర్ల మాజీ ఎంపీటీసీ బింగి భాగ్యమ్మ, గుర్రాల వెంకటేష్ యాదవ్ ,తోటకూర రవీందర్ యాదవ్,,రాసాల కుమార్ యాదవ్ ,బింగి పాపయ్య యాదవ్ ,జెనిగే వెంకటేష్ యాదవ్ , బోడుప్పల్ ఈస్ట్ యాదవ సంఘం అధ్యక్షుడు ఐలయ్య యాదవ్, బింగి యోగేష్ యాదవ్, రాసాల పృథ్వీరాజ్ యాదవ్ , శ్రవణ్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, రామ రావుయాదవ్ , బండి రమేష్ యాదవ్, కదిరి శేఖర్ యాదవ్,పర్వతాలు, గొరిగే నర్సింహం ,యాదవ కుల బంధువులు, వివిధ కుల సంఘాల పెద్దలు,క్రాంతి నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## సిపిఐ నూతన జిల్లా కార్యదర్శిని సన్మానించిన ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు




**ఉరవకొండ ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** ఈనెల 12,13 తేదీలలో అనంతపురం లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాసభలలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పాళ్యం నారాయణస్వామి , జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున ను ఉరవకొండ పట్టణంలోని కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ శివన్న గారి సంస్మరణ సభకు వచ్చిన సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి తగ్గుపర్తి చందు ఆధ్వర్యంలో వారికి పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన జిల్లా నాయకులు గతంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో పనిచేసి నేటి వరకు కూడా ప్రజల పక్షాన పోరాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎదగడం హర్షించదగ్గ విషయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు రాజు,రాజేష్,లాలు స్వామి,ప్రమోద్, ఎల్లప్ప, కార్తీక్, సురేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**లబ్దిదారులకు 4687 కొత్త తెల్ల రేషన్ కార్డు పంపిణీ**

**రామగుండం కార్పొరేషన్ లో ఇప్పటివరకు ఏడు కోట్ల 56 లక్షలతో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు.**

**గోదావరిఖని: ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రామగుండం కార్పొరేషన్ కు చెందిన 111మంది కళ్యాణ లక్ష్మి, షాది ముభారఖ్ లబ్ధిదారులకు రూ.1,11,12,876 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పంపిణీ చేశారు. అలాగే 4687మంది లబ్దిదారులకుకొత్త తెల్ల రేషన్ కార్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎక్కడ కూడా పేద కుటుంబం లేకుండా చేయడమే నా లక్ష్యం అన్నారు. అంతర్గాం మండలంలో రెండు కోట్లతో, పాలకుర్తి మండలం లో రెండు కోట్లతో మహిళ భవన్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం




సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేద కుటుంబానికి అందే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీ లైటింగ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని, అభివృద్ధి జరిగే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు కూడా సహకరించాలనీ కోరారు. రామగుండంలో 1ఐ800 విద్యుత్ పవర్ ప్లాంట్ తీసుకువస్తున్నామని, 25కోట్ల సింగరేణి నిధులతో క్వార్టర్స్ ఏరియాలో రోడ్లు, డ్రైనేజి వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## పీఎంకే జనరల్ కమిటీ సమావేశం

**విల్లివాకం ఆగస్టు17(పీసీడబ్ల్యూ న్యూస్):** పిఎంకె వ్యవస్థాపకుడు డాక్టర్ రామదాస్ ఆదివారం పార్టీ ప్రత్యేక జనరల్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో అన్బుమణి రామదాస్ మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించారని క్రమశిక్షణా కమిటీ ఆరోపించింది. అన్బుమణి 16 రకాల నేరాలకు పాల్పడ్డారని, ముఖ్యంగా పార్టీని విభజించడానికి పనిచేస్తున్నారని నమ్ముతున్నారని ఆరోపిస్తూ క్రమశిక్షణా కమిటీ నివేదిక దాఖలు చేసింది. దీని తరువాత జరిగిన బహిరంగ సభలో డాక్టర్ రామదాస్ మాట్లాడుతూ, "ఈ చారిత్రాత్మక సమావేశం డబ్బుతో ఏర్పాటు చేయబడలేదు అన్నారు.

# జాన్వి ఆశలన్నీ దాని మీదే..!



శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ ఇప్పటికే బాలీవుడ్ లో తన హవా కొనసాగిస్తుంది. ఐతే తన తల్లి లానే సౌత్ లో కూడా తన సత్తా చాటాలని చూస్తుంది అమ్మడు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ దేవరతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది జాన్వి. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కిన ఆ సినిమాలో జాన్వి కపూర్ తంగం పాత్రలో నటించింది. సినిమాలో ఆమెకు ఉన్నవి చాలా తక్కువ సీన్స్. అందులోనే ఆమె గ్లామర్ షో తో మెప్పించింది. దేవర 1 కాదు దేవర 2 లో ఆమెకు మంచి స్కోప్ ఉందని టాక్. దేవర 2 క్యాన్సిల్.. ఐతే ఇప్పుడు పరిస్తితి చూస్తుంటే దేవర 2 దాదాపు క్యాన్సిల్ చేశారనే అంటున్నారు. దేవర 1 రిజల్ట్ కూడా ఆశించిన స్థాయిలో లేదు కాబట్టి దేవర 2 దాదాపు అటకెక్కించారని తెలుస్తుంది. ఐతే దేవర 2 మీద చాలా హెూప్స్ పెట్టుకుంది జాన్వి. ఇప్పుడు అది క్యాన్సిల్ అయ్యింది. ఇక ప్రస్తుతం అమ్మడు చరణ్ తో పెద్ది సినిమా చేస్తుంది. ప్రస్తుతం ఆమెకున్న ఆప్షన్ అదొక్కటే. బుచ్చి బాబు సన డైరెక్షన్ లో తెరకెక్కుతున్న పెద్ది సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. దేవర తో టాలీవుడ్ లో స్టార్ రేంజ్ కి వెళ్లాలని అనుకున్న జాన్వి ఆశలు నెరవేరలేదు. అందుకే నెక్ట్స్ చేస్తున్న పెద్ది సినిమా మీద అమ్మడు అంచనాలు పెట్టుకుంది. ఎలాగు బుచ్చి బాబు ఉప్పెనలో హీరోయిన్ రోల్ ని బాగా రాసుకున్నాడు. పెద్ది కమర్షియల్ సినిమా అయినా కూడా జాన్వికి తగిన ప్రాధాన్యత ఉంటుందటజాన్వి కపూర్ పెద్ది లక్కీ మూవీ.. సో జాన్వి కపూర్ పెద్దినే తన లక్కీ మూవీగా భావిస్తుంది. తెలుగులో పెద్ది తర్వాత ఇంకా చాలా ప్లాన్స్ తోనే ఉందట అమ్మడు. అటు తమిళ్ లో కూడా సినిమాలు చేయాలని ఇంట్రెస్ట్ చూపిస్తుంది. ఐతే తమిళ్ మేకర్స్ మాత్రం జాన్విని తీసుకోవట్లేదు. జాన్వి కపూర్ అటు బాలీవుడ్ లో కూడా మంచి రోల్స్ చేయాలని చూస్తుంది. బీ టౌన్ ఆడియన్స్ ని తన గ్లామర్ తో ఆల్రెడీ బుట్టలో వేసుకున్న జాన్వి కపూర్ ఇక మీదట పర్ఫార్మెన్స్ స్కోప్ ఉన్న రోల్స్ కూడా చేసి మెప్పించాలని చూస్తుంది. సౌత్ లో పెద్ది తర్వాత మళ్లీ వరుస ఛాన్స్ లు ఆశిస్తున్న అమ్మడు అటు నార్త్, సౌత్ అనే తేడా లేకుండా అందరినీ ఆకట్టుకోవాలని చూస్తుంది.

# 'బిగ్‌బాస్-9' అగ్నిపరీక్ష.. ఆసక్తికరంగా ప్రోమో..

హైదరాబాద్: తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఇష్టపడే షోస్‌లో బిగ్‌బాస్ ఒకటి. ఇప్పటికే ఎనిమిది సీజన్లు పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో.. తొమ్మిదో సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. అయితే ఈ సీజన్‌లో సెలబ్రిటీలతో పాటు కామన్‌మ్యాన్‌కు కూడా పాల్గొనే అవకాశం ఉంటుందని ప్రకటించారు. దీంతో ఈ షోలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున సామాన్యులు ధరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరిలో 45 మందిని ఎంపిక చేసి వాళ్లలో అగ్నిపరీక్ష అనే మరో ప్రోగ్రామ్ ద్వారా బిగ్‌బాస్ హౌస్‌లోకి వెళ్లే వాళ్లని ఫైనల్ చేస్తారు.

ఈ అగ్నిపరీక్షకు మాజీ బిగ్‌బాస్ (కంటెస్టెంట్‌లు అయినా.. అభిజిత్, బింధుమాధవి, నవదీప్‌లు జడ్జిలుగా వ్యవహరిస్తున్నారు. శ్రీముఖి ఈ షోకి యాంకర్. తాజాగా ఈ అగ్ని పరీక్ష ప్రోమోని విడుదల చేశారు. కంటెస్టెంట్‌లకు జడ్జిలకు మధ్య జరిగే సంభాషణలతో ప్రోమో ఆసక్తికరంగా సాగింది. ఇక ఆగస్టు 22 నుంచి ఈ అగ్నిపరీక్ష పోటీలకు సంబంధించిన ఎపిసోడ్స్ ప్రసారం కానున్నాయి. ప్రముఖ ఒటిటి సంస్థ జియో హాట్‌స్టార్‌లో ఈ ఎపిసోడ్స్ స్ట్రీమింగ్ అవుతాయి.




# మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సుందరకాండ'

హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ సుందరకాండ. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో నారా రోహిత్ మాట్లాడుతూ "మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఫ్యామిలీ అంతా కలిసి వెళ్లి ఈ సినిమాను చూడొచ్చు. సినిమా మొదలైనప్పుడు ఎంత హ్యాపీగా ఉన్నామో ఇప్పుడు అంతే హ్యాపీగా ఉన్నాం. వినాయక చవితికి ఈ సినిమా రిలీజ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది"అని అన్నారు. డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ "ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. నా తొలి సినిమా వినాయక చవితి పండగ రోజు విడుదల కావడం ఆనందంగా ఉంది"అని తెలిపారు. నిర్మాత సంతోష్ మాట్లాడుతూ "సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. అందరూ సినిమాను చూసి మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను"అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శ్రీదేవి విజయ్ కుమార్, డాక్టర్ నరేష్ వికె, వాసుకి తదితరులు పాల్గొన్నారు.



# చిరంజీవితో భేటీ అయిన నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులు

గత కొన్ని రోజులుగా వేతనాల పెంపు కోసం సినీ కార్మికుల సమ్మె కొనసాగుతూనే ఉంది. ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ నాయకుల మధ్య జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో తాజాగా చిరంజీవి రంగంలోకి దిగారు. గతంలోనే చిరంజీవిని కలిసిన సినిమా నిర్మాతలు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అయితే ఫెడరేషన్ నేతలతోనూ తాను చర్చలు జరిపిన తర్వాతే తన అభిప్రాయాన్ని వెళ్ళడిస్తానని చిరంజీవి చెప్పారు. ఆ తర్వాత చిరంజీవి.. దీనిని ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ చర్చల ద్వారానే పరిష్కారం ఆలోచించమని సూచించారు. కానీ ఛాంబర్, ఫెడరేషన్ మధ్య పలు సార్లు చర్చలు జరిగినప్పటికి పరిష్కారం లభించలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం చిరంజీవిని ఆయన నివాసంలో నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులు విడివిడిగా కలిసి మాట్లాడారు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే వివిధ రాష్ట్రాలలో నిర్మాతలు, కార్మికుల మధ్య ఉన్న ఒప్పందాలను గురించిన సమాచారం



చిరంజీవి సేకరించారని తెలుస్తోంది. ఇక చిరంజీవితో చిన్న నిర్మాతలు కూడా సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో నట్టికుమార్, సురేందర్ రెడ్డి, యలమంచిలి రవి, ఆచంట గోపీనాథ్, కేశవరావు పాల్గొన్నారు. సినీ కార్మికుల సమ్మె, చిన్న నిర్మాతల సమస్యలపై ఈ భేటీలో చర్చించారు. అనంతరం నిర్మాత నట్టికుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'మా బాధలను చిరంజీవికి వివరించామని అన్నారు. చిన్న సినిమాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరాం. సోమవారం ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులతో మాట్లాడుతానని చిరంజీవి అన్నారు. సమస్య పరిష్కారానికి చిరంజీవి కృషి చేస్తానన్నారని చెప్పారు' నట్టికుమార్. అయితే చిరంజీవితో జరిగిన భేటీ సందర్భంగా నిర్మాత సీ కల్యాణ్ మాట్లాడుతూ.. 'సినీ కార్మికుల వేతనాలపై చాంబర్, యూనియన్లు చర్చలతో ముందుకెళ్లాలని చిరంజీవి సూచించారు. సామరస్యంగా చర్చలు జరిపి షూటింగ్ మొదలు పెడితే ఓకే.. లేకపోతే రెండు రోజుల వరకూ వేచిచూస్తానని ఆయన చెప్పారు. అప్పటిదాకా మీరు సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకునే ప్రయత్నం చేయండి. అప్పటికీ పరిష్కారం కాకపోతే తన నిర్ణయం చెబుతానని చిరంజీవి పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చిరంజీవి సూచనను పాటిస్తాము' అని అన్నారు.

# పెద్ది పాట కోసం బుచ్చిబాబు కొత్త ప్లాన్



టాలీవుడ్ లో తెరకెక్కుతున్న మోస్ట్ అవెయిటెడ్ సినిమాల్లో పెద్ది కూడా ఒకటి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్నారు. బుచ్చిబాబు సినిమా అంటే అందులోని పాత్రలు, కథ, ఎమోషన్స్ ఏ రేంజ్ లో ఉంటాయో ఆల్రెడీ ఉప్పెన సినిమాతో అందరూ చూశాం. ఇప్పుడు పెద్ది సినిమా అంతకుమించి ఉంటుందని సమాచారం. నెవర్ బిఫోర్ మేకోవర్ అనౌన్స్‌మెంట్ తోనే భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా విలేజ్ బ్యాక్ డ్రాప్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతుంది. అంతేకాదు, పెద్ది కోసం చరణ్ కెరీర్ లో మునుపెన్నడూ లేనంత కొత్తగా మేకోవర్ కూడా అయ్యారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటున్న ఈ సినిమాలో చరణ్ కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. త్వరలోనే మరో సాంగ్ షూట్ ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన మేకర్స్ ఓ సాంగ్ ను షూట్ చేయగా, త్వరలోనే మరో సాంగ్ ను షూట్ చేయనున్నట్టు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం త్వరలోనే రామ్ చరణ్, జాన్వీ కపూర్ పై వచ్చే ఓ మాంటేజ్ సాంగ్ ను మేకర్స్ తెరకెక్కించనున్నారట. ఈ పాట కేవలం పాటలా మాత్రమే ఉండకుండా కథను ముందుకు తీసుకెళ్లేలా సాగుతూ చాలా కొత్తగా ఉండనుందని సన్నిహిత వర్గాల సమాచారం. రామ్ చరణ్, జాన్వీ కపూర్ కలిసి చేస్తున్న మొదటి సినిమా కావడంతో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో చూడ్డానికి అందరూ ఎగ్జైటింగ్ గా ఉన్నారు. ఈ సినిమాకు ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నిధి అగర్వాల్.. రాజాసాబ్ 'సర్ప్రైజ్'

టాలీవుడ్ లో టాలెంటెడ్, ప్రామిసింగ్ హీరోయిన్స్ లిస్టులో అందాల భామ నిధి అగర్వాల్ కచ్చితంగా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. సవ్యసాచి మూవీతో తెలుగు సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన అమ్మడు.. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. రీసెంట్ గా హరిహర వీరమల్లు మూవీతో సందడి చేసింది నిధి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన వీరమల్లు కోసం ఐదేళ్లపాటు డేట్స్ కేటాయించింది. కానీ అనుకున్న స్థాయిలో రిజల్ట్ అందుకోని నిధి అగర్వాల్.. ఇప్పుడు రాజా సాబ్ పైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ మారుతి కాంబోలో హారర్ కామెడీ డ్రామాగా ఆ మూవీ రెడీ అవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న రాజా సాబ్ లో ముగ్గురు హీరోయిన్స్ నటిస్తున్నారు. నిధి అగర్వాల్ తో పాటు రిద్ధి కుమార్, మాళవిక మోహనన్ సందడి చేయనున్నారు. ఆ ముగ్గురూ రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ లో సందడి చేశారు. అందులో నిధి చాలా అందంగా కనిపించారు.

